# ఇలా ఉంటే?

రచన:
శ్రీ. యస్. సాంబశివరావ్ బాబ్జీ

మనోహరమైన సంధ్యాసమయం--తడిలేని చల్లటి గాలులు నింపాదిగా, తేలిగ్గా వీస్తూ మానవ హృదయాల్ని చక్కిలిగింతలు పెడ్తున్నాయ్—నాలుగు వేపులా ప్రశాంతంగావుంది—బాబూరాం ప్రసాద్ తనయింటి ముందున్న అందమైన పూలతోట మధ్యని మంచం వేసుక్కూచుని హుక్కాగొట్టం నోట్లో పెట్టుకుని తదేకధ్యానంతో పైవేపుకి చూస్తున్నాడు నీలాకాశంలో తను యేదో నేర్చుకుంటున్నట్టు;

"ఆకలి! ఆకలి!—బాబా! చచ్చిపోతున్నాను."

నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ వొచ్చిన యీ మాటలెక్కణ్నుంచో,—ఆయన తనమొహం అటువేపుకి తిప్పి చూశాడు. ఎదురుగుండా ఓ పదహారేళ్ల అబ్బాయి నుంచున్నాడు. గులాబీపువ్వులాంటి అతని మొహం కుమిలిపోయింది. పెదవులెండిపోయాయ్--కళ్ళలోని కాంతి క్షీణించిపోయింది—వొళ్ళంతా ధూళిమయమైపోయింది—ప్రసాద్ బాబుకి అతనిపైని జాలికలిగింది. ఆయన ఓమాటతణ్ని యెగా-దిగా చూసి యింట్లోకి తీసుకెళ్ళిపోయాడు. కాసేపటికా యిద్దరూ ఒక్కొక్క పళ్ళెంతో భోజనం పట్టుకొచ్చారు. వాటిని ఆదగ్గిరగా నేపడున్న మంచంమీద పెట్టి ఆయన ఆపిల్లాణ్ని తినమన్నాడు. ఉవ్విళ్లూరిపోతూన్న కళ్ళతో వాటిని చూపగానే ఆఅబ్బాయి మొహం కళకళలాడింది. అతని చెయ్యి ఆత్రంకొద్దీ దానంతటదే పళ్లెంవేపుకి సాగింది. ఆచెయ్యింకా సగం దూరమేనా వెళ్లలేదు. అంతలోకే ఓభయంకర స్వప్నంచూసినట్టు తుళ్ళిక్కిపడ్డాడా అబ్బాయి,-

"మేం తురకలం బాబా" అన్నాడతను తలెత్తి యెంతో బెంగగా ఆపిల్లాడి కళ్ళలో హద్దుమాలిన కరుణ నిండివుంది. ఆకన్నీటిశక్తిముందు ప్రసాద్ బాబు హృదయం ఓడిపోవాల్సొచ్చింది. ఆయనకి తురకలంటే అపరిమితమైన ద్వేషం—అక్కసు; తక్కిన జాతులన్నింటికన్నా మహమ్మదీయులు నిర్దయులనీ, కటికి కసాయివాళ్ళనీ ఆయన అభిప్రాయం. కాని యీసారి ఆయన కాదనలేకపోయాడు.

"ఊఁ,—తినవోయ్— తర్వాత తోముకోవొచ్చులే" అంటూ హుషారిచ్చాడాయన.

ఆ అబ్బాయి తింటం మొదలెట్టాడు. తన పక్కని మానవమాత్రుడు కాదు, సాక్షాత్ పరమేశ్వరుడే కూచున్నాడనుకొన్నాడతను. ఓ హిందువు తన పళ్ళెంలో మహమ్మదీయుడికి తినిపించటం మానవుడు చెయ్యగలిగే పని కాదు--మహాత్ములైన దేవతల పని!--

భోజనాలవీ ముగిసేక ఆ అబ్బాయి ప్రారంభించాడు.—

"నేనో పెద్దనవాబు కొడుకుని--అదీ యేకైక పుత్రుణ్ని— నేను పదేళ్ళవాణ్నయ్యేసరికి మా అమ్మ చచ్చిపోయింది. అయినా తర్వాతగూడా నా ముద్దూ మురిపెములలో మాత్రం యెలాంటిలోటూ కలగ లేదు. మా నాన్నగారు నన్ను ముందటికన్నా యెక్కువగా ప్రేమించేవారు. అంచేత మా అమ్మ చచ్చిపోయింది గదా అన్న ధ్యాసే నాకుండేది గాదు. నింపాదిగా నా వయసు పన్నెండేళ్లదాకా వొచ్చింది. మా నాన్నగారు మళ్ళీ పెళ్ళిచేసుకోబోతున్నారని ఒహనాడు నాకు తెలిసింది. అది విని నాకెక్కడాలేని ఆనందం కలిగింది. చాలసరదాగా వుంటుందనుకున్నాను. ఆఖరికెలాగో పెళ్ళిరోజు గూడా దగ్గిరబడిపోయింది. నాన్నగారు పెళ్ళికొడుకయారు. గుర్రమెక్కారు. నేనుకూడా మంచిమంచి బట్టలు తొడుక్కున్నాను. ధూమ్-ధామ్‌గా పెళ్ళి సంబరం బయల్దేరింది. మూడోనాడు మేమంతా ఓ పెద్ద పల్లకీ పట్టుకు తిరిగొచ్చాం. మా అమ్మ వొచ్చిందని నేనెంతో ఉబలాటపడ్డాను గాని నేననుకున్నదానికి పూర్తిగా అడ్డం తిరిగింది. తల్లికి బదులుగా నేను ఓ రాక్షసిని వెంటతీసుకొచ్చాను.

సవతల్లి వొచ్చిందగ్గిర్నుంచీ నా కష్టాలు యెక్కువకాసాగేయ్. నాపట్ల మా నాన్నగారి ముద్దుముచ్చట్లన్నీ గాల్లో కలిసిపోయినై. ఇహ ఆ

గృహ పరిశ్రమలను
ప్రోత్సాహపరచండి

శుద్ధ ఖద్దరు
&
లేస్ సిల్కు బట్టలు



—: ఉత్పత్తిదారులు :—
ఇంద్రా ఖాదీ ఎంపోరియమ్
109 (మేడ) సౌత్ మాసి వీధి, మధుర.

*—: Manufacturers :—*
**Indra Khadi Emporium**
109 (Upstairs) South Masi St., MADURA.

యింట్లో ఉండటమే కష్టమనిపించింది. కొసక నే నేదయితే అనుకున్నానో అక్షరాలా అదే అయింది. నా జాతకంలో రాజునుంచి ఫకీరవుతావని వుంది. రాజమహాల్నుంచి ఒక్క అడుగేనా కదపలేనివాణ్ణి యెన్నెన్నో క్రోసులదూర నడవాల్సొచ్చింది—ముఖమలు దుస్తులు తప్పించి మరేయితర సాదాబట్టలూ కట్టని నాశరీరం చినిగి పేలికలయిన చింపిరిగుడ్డల పాలయింది. మాఅమ్మేగాని బ్రతికుంటే యీనాడు నాకిట్లావుండేదేనా?—నిన్నట్నుంచి తిండి తిప్పలూ లేకుండా వేసారి తిరుగుతున్నా—యివ్వాళ ఆకలికి ఆగలేక స్పృహతప్పి మీకాళ్ళదగ్గిర పడ్డాను. లేక పోతే యిలా యెక్కడిదాకా వెళ్ళిపోయేవాణ్నో!-యెప్పటిదాకా వెళ్ళిపొయ్యేవాణ్నో!--నాకే సరిగ్గా తెలీదు. నేనిప్పుడు మిమ్మల్ని శరణుజొచ్చాను. నా జీవితం గడిచిపోయేలాగా నాకేదేనా దారి చూపించండీ.''—

రెండేళ్లు గడిచిపోయినై—రాంప్రసాద్ బాబు దగ్గిర యేవీమార్పు కనిపించలేదు. అక్కడే అన్నమాటేంటి?—యెక్కడా పరివర్తనం కలుగలేనట్టుంది.

ఒహనాడు సాయంకాలం తోటలో ప్రసాద్ బాబూ, ఆ ముస్లిం యువకుడూ కూచుని వ్యవసాయం గురించి యేవేవో చర్చించుకుంటున్నారు. ఇంతలో యకాయకిని పది పన్నెండుమంది సిపాయిలొచ్చివారి చుట్టూ మూగేశారు.

''మీకిక్కడేం పనుందీ?'' అని అడిగాడాయన వాళ్ని.

సర్దార్ ఆ యువకుడి వేపు చూపిస్తూ,—''హుస్సేన్ గంజ్ నవాబుగారి అబ్బాయిని తీసుకురమ్మని నవాబుగారి హుకుమ్'' అన్నాడు.

ఇద్దరు సిపాయిలు యువకున్నెత్తుకుని తీసుకెళ్ళిపోయేందుకి పట్టుకున్నారు.

''నన్ను మరిచిపోబోకండి, బాబూ'' అన్నాడు. యువకు డేడుస్తూ—

''గాబరాపడకు, నాయనా, నేనూ నీవెంటే వొస్తాను'' అని ధైర్యం చెప్పాడు ప్రసాద్‌బాబు కన్నీళ్లు తుడుచుకుంటూ—

* * *

—కొన్నాళ్ళు రాంప్రసాద్ బాబు దక్షిణం వేపుకి ప్రయాణంచేసి చేసి ఆఖరికెట్లాగో హుస్సేన్ గంజ్ సంస్థానం చేరుకున్నాడు-—చూశాడు—నాలుగుమూలలా మంగళ ప్రదమైన వూరేగింపులూ - ఉత్సవాలూ జరుగుతున్నాయ్. ఇళ్ళన్నీ బాగా అలంకరించబడి వున్నాయ్. రకరకాలకేళీవిలాసాలన్నీ జరుగుతున్నాయ్. ఊరంతా గౌరవసూచకంగా బాణాసంచా కాలుస్తున్నారు. ఆయన ఓ పౌరుణ్ని పిలిచి కారణం అడిగాడు— మా నవాబుగారు కాలంచేసారు. యిప్పుడాయన కుమారుడే రాజసింహాసనం యెక్కాడండీ అన్నాడతను. అదివిని ఆయన మొహం ఒక్కసారిగా విప్పారింది. రెండు చేతులూ జోడించి ఆయన ఆకాశంవేపు చూశాడు కళ్లలోంచి పెద్దకన్నీటి బొట్లు రెండు జారిపడ్డాయ్. అగద్గదావస్థలోనే ఆయన రాజమహాలుకెళ్ళాడు. అక్కడ ద్వారపాలకుణ్ని పిలిచి,—రాంప్రసాద్ బాబూ వొచ్చాడని కాస్త తెలీజేస్తావోయ్? అని అడిగాడు.

''యేలినవారిప్పుడు దర్బార్లోవున్నారు. నేను వెళ్లగూడదు'' అని జవాబొచ్చింది.

ప్రసాద్ బాబుకి నిరాశ యెదురయింది. ఆయనకీ సమయంలో ఒకొక్కక్క నిముషం ఒకొక్కక్క యుగంలా వుంది. చట్టున ఓ వుపాయం ఆలోచించి తన జేబులోంచి ఓ అయిదురూపాయిల నోటుతీసి ఆ ద్వారపాలకుడి చేతిలో పడేశాడు. వాడోమాటు లోపలికెళ్లి మళ్లావొచ్చి ''దైచేయండి-దైచేయండి'' అంటూ దారి చూపించాడు.

రాంప్రసాద్ బాబు వొణుకుతూ వొణుకుతూ లోపలికెళ్ళాడు. యెలాగో మెల్లిగా సింహాసనం కాడికొచ్చేశాడు. గద్దైపైనున్న యువకుడాయన్ని చూడగానే గబగబా దిగి ఆయన పాదాల పైని

సాష్టాంగ పడిపోయాడు. అప్పుడాయన కంపించి పోయాడు. వారిద్దరు బొమ్మల్లాగా నుంచుండి పోయారు. యువకుడాయన చెయ్యిపట్టుకుని సింహాసనం దగ్గరగా తీసుకెళ్ళి నాకుమీరు రెండోనాన్నగారు యీ సింహాసనం మీది. దీనిమీద కూచోండి అని ఆహ్వానించాడు.

ప్రసాద్‌బాబు కళ్లంట నీళ్లుకార్తున్నై. అది దుఃఖంతో యేడవటం కాదు—ఆనందబాష్పాలు!—కుమారా, ఆసింహాసనంనీది, నువ్వే దీనిపైని కూచో అన్నాడాయన. ఆయన అతణ్ని "కుమారా" అంటూ పిలవటం యిదేతొలిసారి దాంతో తండ్రీ కొడుకుల సమ్మంధం ఖాయమైపోయింది.

యువకుడాయన్ని తనకుడిచేతి ప్రక్కనున్న కుర్చీమీద కూచోబెట్టుకుని ఆయనముందు కాయితాలూ, కలంప జేసి,—మీరన్నట్టుగానే నేను వూరికే సింహాసనంపైని మాత్రం కూచుంటాను, కాని యీరాజ్యం అంతామీదే. అధికారంమీదే. యింత వరకూ మీ ఆజ్ఞలన్నింటిన్నీ పాలిస్తూవొచ్చాను. ఇప్పుడేగా నన్నుమీరు "కుమారా" అంటూ మీ కన్న కొడుక్కి మల్లే పిలిచారు? అంచేత నాకోరిక నిపుడు మీరు మన్నించాలి" అన్నాడు.

ఇంక ఆలోచించటానికిదిసమయంగాదు. జాతిద్వేషం, భేదభావాలూ, యీబంధనాలన్నీ తెగిపోయినై. నిష్కళంక ప్రేమసముద్రం పొంగిపొర్లింది, పవిత్ర ఆదర్శాలతో నిండివున్న హృదయంలో యిలాంటి అలౌకిక సమ్మంధాన్ని చిరస్థాయిగా వుంచేందుకు రాంప్రసాద్ బాబు ఆదివాను పదవిని అంగీకరించాల్సి వొచ్చింది. ముస్లింనవాబూ హిందూ దివానూకలిసి సర్వప్రజానురంజకంగా పరిపాలించసాగేరు. దేశమంతా ఇలావుంటే, ఇలాంటి పవిత్రాశయాల్తోవుంటే మనకు స్వరాజ్యం రావటం యేపాటి?—


ఆయుర్వేద వైద్యనిలయం వారి

"లుకోరియాక్యూర్"

స్త్రీ గర్భాశయ సంబంధమైన సమస్తవ్యాధులను నిర్మూలించుటలో నిధియని 10 సం॥ అనుభవముచే చెప్పగలుగుచున్నాము. దీనిని సేవించిన పూర్ణారోగ్యము గలిగి వంధ్యత్వము తొలగిపోవును. అనేకమంది దీర్ఘరోగులకు వాడి గుణము పరీక్షింపబడిన ఆయుర్వేద ఔషధరాజము.

90 మాత్రల ప్యాకెట్టు రూ. 2-8-0 ప్యాకింగు పోస్టేజి ప్రత్యేకము.

అన్ని మందులషాపులలో దొరకును.

(మా చిరునామాలో మార్పును గమనించుడు)

ఆయుర్వేద వైద్యనిలయం

రామానాయుడు పేట : : మచిలీపట్టణము.